సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
బుధవారం । 20 । డిసెంబర్ । 2023



22న మండపేటలో సామాజిక సాధికార బస్సు యాత్ర


వైఎస్సార్ సీపీ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సామాజిక సాధికార బస్సు యాత్ర ఈ నెల 22న మండపేటలో జరగనుంది. - 8లో



సుదర్శన హోమానికి విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నారసింహ సుదర్శన హోమానికి ఎస్వీ శ్రీధర్ (బెంగళూరు) మంగళవారం రూ.లక్ష విరాళం అందించారు.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు మంగళవారం 10,100 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,100, మధ్య డెల్టాకు 1,000, పశ్చిమ డెల్టాకు 6,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులగా కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

కల్యాణోత్సవాల పనులకు టెండర్ల ఖరారు



టెండర్ ప్రక్రియ నిర్వహిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది పుణ్యక్షేత్రంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 16 నుంచి 25వ తేదీ వరకూ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణ మహోత్సవాలు జరగనున్నాయి. వీటికి సంబంధించిన వివిధ పనులకు టెండర్ కం బహిరంగ వేలం ఖరారయ్యాయని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. ఇందుకోసం అంతర్వేది ఆలయం వద్ద మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తలనీలాలు పోగు చేసుకునే హక్కుకు టెండర్‌దార్లు ఎవరూ పాల్గొనలేదని ఆయన తెలిపారు. ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ రామలింగేశ్వరరావు, వానపల్లి దేవస్థానం ఈఓ బొక్కా వీర వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు బైర నాగరాజు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మండల స్థాయి సైన్స్ సంబరాలు



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

అమలాపురం టౌన్: జిల్లాలోని 26 యూనిట్ల పరిధిలో గురువారం మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నారు. జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) జిల్లా శాఖ అధ్యక్షుడు ఈఆర్ సుబ్రహ్మణ్యం ఈ విషయం తెలిపారు. జేవీవీ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సైన్స్ సంబరాల్లో ఆయా మండల యూనిట్లకు చెందిన 326 టీములు పాల్గొంటాయని తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 వరకూ చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. మండల స్థాయి విజేతలు వచ్చే నెలలో జరిగే జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొంటారని చెప్పారు. అన్ని స్థాయిల్లో విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేస్తామని తెలిపారు. సమావేశంలో జేవీవీ రాష్ట్ర, జిల్లా ఉపాధ్యక్షులు కేవీవీ సత్యనారాయణ, జనుపల్లి సత్యనారాయణ, చెకుముకి కన్వీనర్ ఎస్.అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి కుష్ఠు వ్యాధి నియంత్రణ కార్యక్రమం

అమలాపురం రూరల్: ఈ నెల 27 నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకూ జరిగే జాతీయ కుష్ఠు వ్యాధి నియంత్రణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.నూపుర్ అజయ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఈ కార్యక్రమంపై వైద్య, ఆరోగ్య సిబ్బందికి ఆమె దిశానిర్దేశం చేశారు. ఆశా కార్యకర్తలు, గ్రామ/వార్డు వలంటీర్ల సమన్వయంతో జిల్లావ్యాప్తంగా కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించి, నివారణ, నియంత్రణ చర్యలను బలోపేతం చేయాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా 72 మంది కుష్ఠు బాధితులున్నారని, వీరందరికీ మల్టీ డ్రగ్ థెరపీ ద్వారా వ్యాధి నియంత్రణ చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ చికిత్సా విధానం వ్యాధిని పూర్తిగా నయం చేస్తుందన్నారు. ఈ ఔషధాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఉచితంగా అందిస్తోందన్నారు. ఇది దీర్ఘకాలిక అంటు వ్యాధి అని, తొలి దశలో చికిత్స చేయడం వల్ల వైకల్యాన్ని పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి ఎం.దుర్గారావుదొర, డీసీహెచ్ఎస్ పద్మశ్రీరాణి, కుష్ఠు వ్యాధి నియంత్రణ అధికారి, అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి భరతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

అమలాపురం రూరల్: స్థానిక ఉపాధి కల్పనా కార్యాలయంలో గురువారం ఉదయం 10.30 గంటల నుంచి జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. ఉపాధి అధికారి ఇ.వసంతలక్ష్మి మంగళవారం ఈ విషయం తెలిపారు. ప్రైవేటు సంస్థలో పని చేయడానికి పదో తరగతి, ఐటీఐ, డిగ్రీ, నర్సింగ్ చదివిన స్త్రీ, పురుష అభ్యర్థులు దీనికి అర్హులని పేర్కొన్నారు. అమలాపురం పరిసర ప్రాంతాల్లో పని చేయాలన్నారు. ఇంటర్వ్యూల్లో ఎంపికైన వారికి పోస్టును బట్టి రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకూ జీతం ఇస్తారని వివరించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో ఉపాధి కల్పనా కార్యాలయానికి రావాలని సూచించారు. వివరాలకు 81218 38392 ఫోన్ నంబరులో సంప్రదించాలని వసంతలక్ష్మి తెలిపారు.

టిప్‌ట్యాబ్‌గా..

- ప్రభుత్వ పాఠశాలల్లో దర్జాగా డిజిటల్ పాఠాలు
- ఈ ఏడాదీ ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు
- సీఎం జగన్ పుట్టిన రోజు సందర్భంగా రేపు పంపిణీ
- ఇప్పటికే మండల కేంద్రాలకు చేరిక



ట్యాబ్‌లను వినియోగిస్తున్న ఈ ఏడాది తొమ్మిదో తరగతి విద్యార్థులు

రాయవరం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులందరూ ఇప్పుడు టిప్'ట్యాబ్'గా చదువుకుంటున్నారు. సర్కారీ బడుల్లోని విద్యార్థులు కూడా డిజిటల్ చదువులు అభ్యసించాలనే సమున్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో నూతన మార్పులకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గత విద్యా సంవత్సరంలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు పంపిణీ చేశారు. తద్వారా విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే మన బడి నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారు.. చేస్తున్నారు. జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద వంటి సంక్షేమ కార్యక్రమాలను విద్యార్థులకు అందిస్తున్నారు. జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా పేద విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తోంది. ఈ క్రమంలోనే ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో సైతం లేని విధంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని డిజిటల్ బోధనకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే గత విద్యా సంవత్సరంలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు, ఆ తరగతి బోధించే ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు అందజేసింది. దీంతో పాటు ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానల్స్ (ఐఎఫ్‌పీ), ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీల ద్వారా కూడా బోధనకు శ్రీకారం చుట్టింది. గత విద్యా సంవత్సరం ఎనిమిదో తరగతి విద్యార్థులు ఇప్పుడు తొమ్మిదో తరగతి చదువుతున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు కూడా దశల వారీగా ట్యాబ్‌లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా.. గురువారం ఆయన చేతుల మీదుగా ఈ విద్యా సంవత్సరంలో మొదటి దశ ట్యాబ్‌ల పంపిణీ ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఈ ట్యాబ్‌లు మండల కేంద్రాలకు చేరాయి. తొలి విడతగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 18,510 ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నారు. మిగిలిన వారికి కూడా దశల వారీగా అందిస్తారు.



64 జీబీ ఎస్‌డీ కార్డుతో పాఠాలు అప్‌లోడ్

పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం.. పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తోంది. డిజిటల్ బోధన కోసం విద్యారంగంలో ప్రసిద్ధి పొందిన బైజూస్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆ సంస్థ సబ్జెక్టుల వారీగా రూపొందించిన పాఠాలతో కూడిన 64 జీబీ ఎస్‌డీ కార్డును ట్యాబ్‌లో అప్‌లోడ్ చేసి, పంపిణీ చేస్తున్నారు. ఆఫ్‌లైన్‌లోనూ విద్యార్థులు ఈ పాఠాలు వినేలా ట్యాబ్‌ను రూపొందించారు. ప్రభుత్వ పాఠశాల చైల్డ్ ఇన్ఫోలో నమోదైన ప్రతి ఎనిమిదో తరగతి విద్యార్థికీ ట్యాబ్‌లు అందజేస్తున్నారు. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ, హిందీతో పాటు మరో ఆరు భాషల్లో ఈ–కంటెంట్ లభ్యమవుతోంది.

ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రభుత్వం పంపిణీ చేసే ట్యాబ్‌ల నిర్వహణ, బైజూస్ యాప్ వాడకంపై ఉపాధ్యాయులకు ఇప్పటికే అవగాహన కల్పించారు. ప్రతి మండలంలోనూ ఇద్దరు ఉపాధ్యాయులకు, క్లస్టర్ రీసోర్స్ పర్సన్లు (సీఆర్‌పీ), మండల వనరుల కేంద్రం (ఎంఆర్‌సీ) సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వీరి ద్వారా మండలంలోని ఇతర ఉపాధ్యాయులకు, విద్యార్థులకు శిక్షణ ఇప్పించారు. ఈ ఏడాది ట్యాబ్‌లు అందుకోబోయే విద్యార్థులకు వాటి వినియోగంపై కూడా ఆయా ఉపాధ్యాయులు శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే మరోవైపు పిల్లలు అసభ్యకర, అనవసర వెబ్‌సైట్లు ఓపెన్ చేయకుండా లాక్ చేసి ఉంచేలా చర్యలు తీసుకున్నారు. తద్వారా విద్యార్థులు పక్కదారి పట్టే అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

ఈ ఏడాది జిల్లాల వారీగా మొదటి దశలో అందించనున్న ట్యాబ్‌ల వివరాలు

జిల్లా	మండలాలు	8వ తరగతి విద్యార్థులు	అందిస్తున్న ట్యాబ్‌లు
కాకినాడ	21	20,016	6,620
తూర్పు గోదావరి	19	15,028	5,510
కోనసీమ	22	13,605	6,380

ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, గణితం, సోషల్ పాఠాలను విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునేలా యానిమేషన్, వీడియో, ఆడియోలతో బైజూస్ కంటెంట్ రూపొందించారు. ఇందులో మాక్ టెస్టులు కూడా అందుబాటులో ఉంచారు. విద్యార్థులు 9, 10 తరగతులకు వెళ్లే సమయానికి ఆయా తరగతుల పాఠ్యాంశాలకు సంబంధించిన కంటెంట్‌ను అప్‌లోడ్ చేస్తారు. దీనివలన విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెరగడంతో పాటు ఆంగ్లంపై పట్టు, నైపుణ్యాలు, పోటీతత్వం పెంపొందే అవకాశముంటుంది.

ప్రతి విద్యార్థికీ అందజేయాలి



ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదివే విద్యార్థులకు ప్రభుత్వం క్రమం తప్పకుండా ట్యాబ్‌లు అందజేస్తోంది. వీటిని ప్రతి విద్యార్థికీ అందించే బాధ్యత సంబంధిత ప్రధానోపాధ్యాయులు తీసుకోవాలి. పేద విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న డిజిటల్ విద్య సత్ఫలితాలనిస్తోంది.

– ఎం.కమలకుమారి, జిల్లా విద్యాశాఖాధికారి, అమలాపురం

నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ



ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదివే విద్యార్థులకు గత ఏడాది ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ ఏడాది కూడా వీటిని విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జిల్లా కేంద్రానికి వచ్చిన ట్యాబ్‌లను మండల కేంద్రాలకు పంపిణీ చేశాం. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు రాబోయే 9, 10 తరగతుల్లో వీటిని వాడుకోవాల్సి ఉంటుంది.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యా శాఖ, కాకినాడ

వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా కమిటీ నియామకం

జిల్లా అధ్యక్షుడిగా నాగేంద్ర



అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బీసీ సెల్ జిల్లా కమిటీని పార్టీ అధిష్టానం నియమించింది. అధ్యక్షునిగా అమలాపురానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు మట్టపర్తి నాగేంద్ర నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా గుబ్బల సత్యనారాయణ (రాజోలు నియోజకవర్గం), అన్నవరం (ముమ్మిడివరం); ప్రధాన కార్యదర్శులుగా దొమ్మేటి నాగేశ్వరరావు (పి.గన్నవరం), నాత్ర వీర్రాజు (ముమ్మిడివరం), పంపన సుబ్బారావు (రామచంద్రపురం), రాజులపూడి భాస్కరరావు (అమలాపురం), తాడిచర్ల సీతారామయ్య (రాజోలు), పి.రాంబాబు (కొత్తపేట), పసలపూడి శ్రీనివాసరావు (మండపేట); కార్యదర్శులుగా యాండ్ర వీరబాబు (పి.గన్నవరం), కొల్లు రాంబాబు (పి.గన్నవరం), విత్తనాల శ్రీను (ముమ్మిడివరం), నీలపల్లి శ్రీనివాసరావు (ముమ్మిడివరం), పెంకే వీర రాఘవులు (రామచంద్రపురం), నున్నబోయిన ప్రసాద్ (రామచంద్రపురం), శీలం శ్రీనుబాబు (అమలాపురం), బొక్కా శ్రీను (అమలాపురం), చెల్లుబోయిన బుచ్చయ్య (రాజోలు), కంచి వెంకట రమణ (రాజోలు), సీహెచ్. సత్యనారాయణ (కొత్తపేట), ఎం.సత్యనారాయణ (కొత్తపేట), కుక్కల శ్రీనివాస్ (మండపేట), కాకి సత్యనారాయణ (మండపేట) నియమితులయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా కడలి సుబ్రహ్మణ్యం (పి.గన్నవరం), దంగేటి సూర్యనారాయణ (పి.గన్నవరం), గుత్తుల వీవీ సత్యనారాయణ (ముమ్మిడివరం), సంగాని సత్యనారాయణ (ముమ్మిడివరం), పిల్లి బాల సుబ్రహ్మణ్యం (రామచంద్రపురం), మట్టా త్రినాథరావు (రామచంద్రపురం), ఇళ్ల శ్రీనివాస్ (రాజోలు), దండుమేను రూపేష్ (అమలాపురం), సందాడి యేసుబాబు (రాజోలు), వి.వెంకటేశ్వరరావు (కొత్తపేట), బొక్కా లోవ సత్యనారాయణ (కొత్తపేట), సూరంపూడి ప్రతాపరాజు(మండపేట)లను నియమించారు.

వీధి విక్రయ సంఘాలతో స్వయం ఉపాధి



వీధి విక్రయదారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్యామ్‌బాబు

జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్యామ్‌బాబు

అమలాపురం టౌన్: వీధి విక్రయదారులు సంఘాలుగా ఏర్పడి పీఎం స్వనిధి పథకం ద్వారా బ్యాంకుల నుంచి వ్యక్తిగత రుణాలు తీసుకుని స్వయం ఉపాధికి బాటలు వేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్యామ్‌బాబు సూచించారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యాన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడు అధ్యక్షతన మంగళవారం జరిగిన వీధి విక్రయదారుల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణాన్ని గ్రీన్, రెడ్, ఎల్లో జోన్‌లుగా విభజించి, ప్రజలకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించే విధంగా వీధి విక్రయదారులు తమ వ్యాపారాలు సాగించాలని ఆయన సూచించారు. పీఎం స్వనిధి ద్వారా రుణాలు తీసుకున్న వారు వాటిని సక్రమంగా చెల్లిస్తే తిరిగి రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకూ రుణాలు మంజూరు చేస్తామన్నారు. డిజిటల్ ట్రాన్స్‌ఫర్ ద్వారా వ్యాపార ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తే ప్రభుత్వం నుంచి మరింత ప్రోత్సాహం ఉంటుందని వివరించారు. జిల్లా మెప్మా అధికారి కె.మోహనకుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా వీధి వ్యాపారుల కమిటీ సమావేశం విధిగా నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్, ట్రాఫిక్ ఎస్సై, లేబర్ ఇన్‌స్పెక్టర్, సీడీపీఓ, హెల్త్ సూపరింటెండెంట్‌లు మాట్లాడుతూ, వీధి విక్రయదారులకు తమ శాఖల నుంచి సహాయ సహకారాలుంటాయని చెప్పారు. సమావేశంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ వి.రామలక్ష్మి, డీపీఎం యు.శ్రీనివాస్, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు అప్పారి దేవకి, కృష్ణవేణి, రాజేశ్వరి, పట్టణ సమాఖ్య రిసోర్స్‌పర్సన్ పాము శ్యామల పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ కేంద్రాలపై చర్యలు

- జేసీ నూపుర్ అజయ్ ఆదేశం
- అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నూపుర్ అజయ్

అమలాపురం రూరల్: గర్భస్థ పిండ ఆరోగ్యాన్ని పరిశీలించేందుకు నిర్దేశించిన వైద్య పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను జాయింట్ కలెక్టర్ నూపుర్ అజయ్ ఆదేశించారు. గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టం (పీసీపీఎన్‌డీటీఏ) అమలుపై కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆడ శిశువుపై వివక్షతో జరిగే భ్రూణ హత్యల నివారణకు లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. అల్ట్రాసౌండ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణకు ఉపయోగించుకోవడం నేరమని చెప్పారు. జిల్లాలో అనుమతి పొందిన 83 అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై క్రమం తప్పకుండా డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. గ్రామ స్థాయిలో అనధికారికంగా జరుగుతున్న అబార్షన్లను గుర్తించి, లింగ నిర్ధారణ నిషేధిత చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి స్కానింగ్ సెంటర్‌లో పీసీపీఎన్‌డీటీ చట్టానికి సంబంధించిన బోర్డులు, వాల్‌పోస్టర్లను పూర్తి వివరాలతో తప్పనిసరిగా ప్రదర్శించాలని స్పష్టం చేశారు. తద్వారా ఆడపిల్లల పట్ల వివక్షను పూర్తిగా రూపుమాపుతూ, స్త్రీ, పురుష లింగ నిష్పత్తి సమానత్వ సాధన ద్వారా ఆరోగ్యకర సమాజ స్థాపనకు పాటు పడాలని జేసీ నూపుర్ అజయ్ సూచించారు. ఈ చట్టం జిల్లా కమిటీ కన్వీనర్, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి ఎం.దుర్గారావుదొర మాట్లాడుతూ, ఆడ శిశువు పట్ల వివక్షతో జరిగే భ్రూణ హత్యల నివారణతో పాటు జిల్లా స్థాయిలో లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సభ్యులకు సూచించారు. గ్రామ స్థాయిలో ఏఎన్ఎం, ఆశా వర్కర్లు సంయుక్తంగా గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. జిల్లావ్యాప్తంగా కొత్తగా రెండు అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు అందాయని, మరో రెండింటి రెన్యువల్‌కు, స్కానింగ్ కేంద్రాల్లో ఆధునీకరణ, యంత్రాలు, ఉద్యోగుల మార్పుపై దరఖాస్తులు అందాయని వివరించారు. సమావేశంలో కమిటీ సభ్యులు, జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి పద్మశ్రీరాణి, అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి సీహెచ్‌వీ భరతలక్ష్మి, డీఐఓ సత్యనారాయణ, రెడ్‌క్రాస్ కార్యదర్శి పీఎస్ శర్మ, సాంఘిక సంక్షేమ సాధికార అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి బై.. వైఎస్సార్ సీపీకి జై..



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలువేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: అన్ని వర్గాల వారికీ అసలైన సామాజిక న్యాయం వైఎస్సార్ సీపీతోనే సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు ముస్లింలు వైఎస్సార్ సీపీలో చేరారు. సయ్యద్ రియాజ్ పాషా, షేక్ అబ్దుల్ కరీమ్, పి.రహీమ్ బాషా, షేక్ యాకూబ్ బాషా, షేక్ నసీరుద్దీన్, ఎండీ అబ్దుల్ ఖయ్యూమ్ తదితరులు వైఎస్సార్ సీపీలో చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న సామాజిక న్యాయానికి ఆకర్షితులమై టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరామని ఈ సందర్భంగా వారు చెప్పారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి వైఎస్సార్ సీపీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

అన్నదాన భవనానికి విరాళాలు



దాతలకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి భక్తుల నుంచి విరాళాలు అందినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. తణుకు పట్టణానికి చెందిన జీఎస్ రామచంద్రరావు రూ.25 వేలు, ఖమ్మం జిల్లా కొత్తగూడేనికి చెందిన వి.నరసింహారావు రూ.10,116, గోపాలపురానికి చెందిన ఆర్ఎస్ ఎస్వీ సుబ్రహ్మణ్యం రూ.10,116 విరాళాలు అందించారని వివరించారు. దాతలకు కమిటీ సభ్యులు స్వామి చిత్రపటం అందజేశారు.

అమంగళాలను తొలగించే రామపాదం

సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖశర్మ



ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): 'గౌతముని శాపం వలన ఎవరికీ కనపడకుండా శిల వలె ఆశ్రమంలో పడి ఉన్న అహల్య ఆశ్రమంలోకి శ్రీరాముడు ప్రవేశించగానే ఆమెకు శాపవిముక్తి కలిగింది. ఆమెకు తపస్సిద్ధి కలిగింది' అని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. హిందూ సమాజంలో మంగళవారం ఆయన సప్తమ దివస రామాయణ ప్రవచనాన్ని కొనసాగించారు. 'తాటక వధతో మహారణ్యంగా మారిన అడవి జనావాసంగా మారింది. రాముడు ఆశ్రమంలోకి ప్రవేశించగానే అహల్య శాపవిముక్తురాలయింది. అమంగళాలను తొలగించేది రామపాదం' అని సామవేదం అన్నారు. 'అహల్యాగౌతముల పుత్రుడు శతానందుడు జనకునికి పురోహితుడు. ఆతిథ్యం భార్యాభర్తలిద్దరూ కలసి ఇవ్వాలి. అహల్య శాపవిముక్తి కాగానే ఆమె భర్త గౌతముడు అక్కడికి వచ్చాడు. భార్యాభర్తలు తిరిగి కలిశారు. జనకుని యాగానికి విశ్వామిత్రుని వెంట రామలక్ష్మణులు వచ్చారు. యజ్ఞసభలో రాముడు శివ ధనుర్భంగం చేశాడు. స్వయంవరంలో కాదు. అక్కడికి రావణుడు రావడం సినిమాల సృష్టి. వాల్మీకి చెప్పినది కాదు' అని స్పష్టం చేశారు. సీతారాముల కల్యాణ వృత్తాంతాన్ని ఆయన రసవత్తరంగా వర్ణించారు. వాల్మీకి శ్లోకాలతో పాటు, కవి సమ్రాట్ విశ్వనాథ కల్పవృక్షంలోని పద్యాలను ఆయన భావయుక్తంగా వివరించారు.

అయోధ్య నుంచి సామవేదం షణ్ముఖశర్మకు ఆహ్వానం

వచ్చే నెల 22వ తేదీన అయోధ్యలో జరగనున్న సీతారామలక్ష్మణుల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవానికి సామవేదం షణ్ముఖశర్మ ఆహ్వానం అందుకున్నారు. ఈ మేరకు శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్ నుంచి ఆయన మంగళవారం ఆహ్వానం అందుకున్నారు.

రుడా చైర్ పర్సన్‌గా షర్మిలారెడ్డి

సాక్షి, రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్‌పర్సన్‌గా మేడపాటి షర్మిలారెడ్డి నియమితులయ్యారు. ఆ పదవిని రెండోసారి ఆమెకు కేటాయిస్తూ ప్రభుత్వ కార్యదర్శి ధనుంజయరెడ్డి మంగళవారం ఉత్తర్వులు వెలువరించారు. రుడా ప్రారంభం సమయంలో చైర్‌పర్సన్‌గా నియమితులైన ఆమె రెండేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగారు. తాజాగా మరోసారి ఆమె పదవిని పొడిగించారు. రెండేళ్ల కాలంలో తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల్లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడమే కాకుండా పూర్తి చేశారు. తనకు తిరిగి పదవి అప్పగించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, సహకరించిన నాయకులకు షర్మిలారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలు మరింత విస్తృతం చేసి, ప్రభుత్వంపై ప్రజలకు మంచి భావన వచ్చేలా కృషి చేస్తానని చెప్పారు.

గ్రీన్‌కోర్ రాష్ట్ర డైరెక్టర్ పర్యటన



ముమ్మిడివరంలో స్రవంతిని స్వాగతిస్తున్న అధికారులు

రాయవరం: నేషనల్ గ్రీన్‌కోర్ రాష్ట్ర డైరెక్టర్ పి.స్రవంతి జిల్లాలో ఐదు రోజుల పాటు విస్తృతంగా పర్యటించారు. పర్యావరణ పరిరక్షణలో పాఠశాలలు భాగస్వామ్యమయ్యేందుకు, విద్యార్థులు పర్యావరణంపై అవగాహన పెంచుకునేందుకు ప్రభుత్వం పాఠశాలల్లో నేషనల్ గ్రీన్‌కోర్ విభాగాలను ఏర్పాటు చేసింది. వీటితో పాటు పర్యావరణ పరిరక్షణకు, పచ్చదనాన్ని పెంపొందించడానికి ప్రైవేటు పాఠశాలల్లో ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో పరిశీలించి, మొక్కల పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై స్రవంతి అవగాహన కల్పించారు. ఈ నెల 15 నుంచి మంగళవారం వరకూ ఆమె జిల్లావ్యాప్తంగా పర్యటించారు. ఇప్పటికే సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు, మామిడికుదురు, ముమ్మిడివరం, ఐ.పోలవరం, రావులపాలెం, ఆలమూరు, మండపేట, రామచంద్రపురం మండలాల్లోని వివిధ పాఠశాలలను సందర్శించారు. ఆమె వెంట రామచంద్రపురం డీవైఈఓ నరసింహ ఫణి, డీఈఓ కార్యాలయం ఏడీ నక్కా సురేష్, డీసీఈబీ సెక్రటరీ బి.హనుమంతరావు, సమగ్ర శిక్షా సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, సీనియర్ ఎంఈఓ బి.రమణశ్రీ, గ్రీన్‌కోర్ జిల్లా కో ఆర్డినేటర్ జి.ప్రభావతి, ఆయా ఎంఈఓలు ఉన్నారు.

క్లుప్తంగా

జాతీయ కిక్ బాక్సింగ్‌కు ఎంపిక



కిక్ బాక్సింగ్‌లో బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందించిన సామర్లకోట కోచింగ్ సెంటర్ నిర్వాహకులు

సామర్లకోట: జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు సామర్లకోటకు చెందిన పాము బెన్నీ రాజశేఖర్ ఎంపికయ్యాడు. ఖేలో ఇండియా రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకూ విశాఖపట్నంలో జరిగాయి. ఈ పోటీల్లో రాజశేఖర్ ప్రతిభ చూపి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని కోచ్ పి.సువర్ణకుమార్ తెలిపారు. స్థానిక షారోస్ చారిటబుల్ ట్రస్టుకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో బహుమతులు సాధించారని చెప్పారు. పాము స్నేహలత, ఎం.ప్రియాంకరాణి బంగారు పతకాలు, పాము సుమలత, పి.ఉమా గీతాంజలి, పి.కీర్తన, ఎం.శరణ్యలు రజత పతకాలు, ఎం.నవ్యగీత, డి.శాన్వి కాంస్య పతకాలు సాధించారని వివరించారు.

శతాధిక వృద్ధురాలి మృతి



చంద్రం (ఫైల్)

రాజానగరం: మండలంలోని పాలచర్లకు చెందిన 108 సంవత్సరాల వృద్ధురాలు వల్లభశెట్టి చంద్రం మంగళవారం మృతి చెందారు. ఆమె మనుమడు పిల్లా సత్య ఈ విషయం తెలిపారు. చంద్రానికి ఒక కుమార్తె. ఆమె వద్దనే ఆ వృద్ధురాలు ఉంటున్నారు. ఆమెకు మనుమలు, మునిమనుమలు కూడా ఉన్నారు.

రేపు నన్నయలో మెగా జాబ్ మేళా



జక్కంపూడి రాజా, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

రాజానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజైన గురువారం ఆదికవి నన్నయ యూనివర్సిటీలో మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్టు స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తెలిపారు. జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ సహకారంతో వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ ఆధ్వర్యంలో జరిగే ఈ మేళాలో సుమారు 30 ప్రముఖ కంపెనీలు, సంస్థల ద్వారా మూడు వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో ఇంటింటికీ వెళ్లిన సమయంలో పలువురు తల్లిదండ్రులు తమ పిల్లల ఉపాధి గురించి చేసిన విజ్ఞప్తుల నేపథ్యంలో ఈ మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. పదో తరగతి నుంచి పీజీ వరకూ చదువుకున్న అభ్యర్థులు ఆ రోజు ఉదయం 9 గంటలకే యూనివర్సిటీ ప్రాంగణానికి చేరుకోవాలన్నారు. మేళాకు వచ్చే అభ్యర్థులకు, వారి వెంట వచ్చే వారికి భోజన సదుపాయం కల్పిస్తున్నామన్నారు.

పేదల ఆరోగ్య పరిరక్షణే సీఎం జగన్ లక్ష్యం

- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిమితి ఐదింతలకు పెంపు
- మంత్రి మేరుగు నాగార్జున
- నల్లజర్లలో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న మంత్రి నాగార్జున, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: పేదల ఆరోగ్య పరిరక్షణే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. ఈ దిశలోనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తోందని చెప్పారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావుతో కలసి నల్లజర్ల సచివాలయం వద్ద కొత్త ఫీచర్లతో కూడిన ఆరోగ్యశ్రీ కార్డులను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తోందన్నారు. ఇప్పటి వరకూ రూ.5 లక్షలుగా ఉన్న ఆరోగ్యశ్రీ చికిత్స ఖర్చు పరిమితిని రూ.25 లక్షలకు పెంచిందని తెలిపారు. ఈ పథకం కింద మన రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాల్లోని కార్పొరేట్ ఆసుపత్రుల్లో సైతం దాదాపు 3,200 జబ్బులకు ఉచిత వైద్యం పొందే అవకాశం కల్పించిందని గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా కింద ప్రభుత్వం ఏటా రూ.4,100 కోట్లు పైగా ఖర్చు చేస్తోందని తెలిపారు. నాడు–నేడు కింద ప్రభుత్వాసుపత్రులను ఆధునీకరించిందని, వైద్య, పారా మెడికల్ సిబ్బందితో పాటు సూపర్ స్పెషాలిటీ వైద్యులను నియమించిందని చెప్పారు. ప్రతి జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల, రీసెర్చి సెంటర్లను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పటికే ఉన్న 11 వైద్య కళాశాలల ఆధునీకరణ, కొత్తగా మరో 17 కళాశాలల నిర్మాణానికి రూ.32,279 కోట్లు ఖర్చు చేస్తోందని మంత్రి నాగార్జున వివరించారు.

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ, వైద్యం కోసం పేదలు అప్పుల పాలు కాకూడదనే ఉద్దేశంతోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ చికిత్స పరిమితిని రూ.25 లక్షలకు పెంచారని అన్నారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ సమయంలో లబ్ధిదారులకు అన్ని విషయాలూ వివరించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లి జ్యోతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, ఎంపీడీఓ రాజశేఖర్, వైద్యులు గంగాధరరావు, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

22న మండపేటలో సామాజిక సాధికార బస్సు యాత్ర

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వెల్లడి
- సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం సాధ్యమని పునరుద్ఘాటన



బస్సు యాత్ర వివరాలను వెల్లడిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం (మండపేట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సాధికారతకు చేసిన అభివృద్ధిని వివరించేందుకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సామాజిక సాధికార బస్సు యాత్ర ఈ నెల 22న మండపేటలో జరగనుంది. పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఈ విషయం వెల్లడించారు. మండపేటలోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ పాలనలోనే రాష్ట్రంలో సామాజిక న్యాయం సాధ్యమైందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమమే అందుకు నిదర్శనమని అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల వారికి నేరుగా రూ.2.38 లక్షల కోట్ల మేర లబ్ధి చేకూర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రభుత్వ సాయాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేయడం ద్వారా పూర్తి పారదర్శక పాలనను అందిస్తున్నారన్నారు. ఇది సామాజిక న్యాయానికి దారి తీస్తుందని చెప్పారు.

మండపేటలో జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నామని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చెప్పారు. 22వ తేదీ సాయంత్రం 3 గంటలకు పట్టణంలోని పెద్దకాలువ వద్ద ఉన్న మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహానికి నేతలు పూలమాల వేసిన అనంతరం, సామాజిక సాధికార బస్సు యాత్ర పట్టణ ప్రధాన రహదారిలోకి ప్రవేశిస్తుందని తెలిపారు. పట్టణ వీధుల్లో యాత్ర సాగిన అనంతరం 4 గంటలకు కలువపువ్వు సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఈ యాత్రలో రాష్ట్ర మంత్రులు పినిపే విశ్వరూప్, జోగి రమేష్, కారుమూరు వెంకట నాగేశ్వరరావు, ఎంపీలు చింతా అనురాధ, పిల్లి సుభాష్‌చంద్రబోస్, నందిగం సురేష్, మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, పండుల రవీంద్రబాబు పాల్గొంటారని వివరించారు.

సామాజిక సాధికార బస్సు యాత్రకు రాష్ట్ర వ్యాప్తంగా విశేష ప్రజాదరణ లభిస్తోందని, మండపేట నియోజకవర్గంలో కూడా ప్రజా మద్దతుతో ఈ యాత్ర విజయవంతమవుతుందని అన్నారు. దీనికోసం పార్టీ శ్రేణులు విశేషంగా కృషి చేస్తున్నాయని ఎమ్మెల్సీ తోట చెప్పారు. విలేకర్ల సమావేశంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ, వైఎస్సార్ సీపీ కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎస్సీ, బీసీ నాయకులు మేడిశెట్టి దుర్గారావు, ముమ్మిడివరపు బాపిరాజు, తుపాకుల ప్రసన్న కుమార్, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యురాలు కురుపూడి భవాని, కౌన్సిల్‌లో విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్, పార్టీ రూరల్ కన్వీనర్ పిల్లా వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు హ్యాకథాన్ దోహదం



హ్యాకథాన్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

గండేపల్లి: భావి ఇంజనీర్ల ఆలోచనల నుంచి రూపు దిద్దుకునే నూతన ఆవిష్కరణలకు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ కార్యక్రమం దోహదపడుతుందని ఆదిత్య కళాశాలల డైరెక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి, ముఖ్య అతిథి ఏఐసీటీఈ ప్రతినిధి యుక్తి అంకుర సంస్థ వ్యవస్థాపకుడు ప్రణవ్ దీక్షిత్, గౌరవ అతిథి ఐ4సీ కంపెనీ మేనేజర్ సౌరభ్ ఉబాలే అన్నారు. సూరంపాలెం ఆదిత్య విద్యాసంస్థల్లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్–2023 గ్రాండ్ ఫినాలే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం 36 గంటల పాటు నిర్విరామంగా జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలకు పదును పెడుతూ నూతన ఆవిష్కరణలు చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా భావి ఇంజనీర్ల ప్రతిభను వెలికి తీయడానికి ప్రధాని మోదీ ఈ వినూత్న కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. దేశం నలుమూలల నుంచీ 27 టీములు, 189 మంది సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఎ.లక్ష్మణరావు, డీన్‌లు ఎస్.రమాశ్రీ, జేడీ వెంకటేష్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

ముమ్మిడివరం: విదేశం వెళ్లేందుకు భర్త నిరాకరించాడనే మనస్తాపంతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ముమ్మిడివరం బాలయోగి కాలువ గట్టు ప్రాంతానికి చెందిన కముజు లక్ష్మీ నీలిమ (34) జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి రెండేళ్ల క్రితం ఇండియాకు వచ్చింది. అప్పటి నుంచీ ఆమె, భర్త నాగరాజు ముమ్మిడివరంలోని ఓ అద్దె ఇంట్లో ఉంటున్నారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటీవల మళ్లీ గల్ఫ్ దేశాలకు వెళ్లేందుకు నీలిమ ప్రయత్నించగా, భర్త నాగరాజు నిరాకరించాడు. ఆమె పాస్‌పోర్టును సైతం సోమవారం కాల్చివేశాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన నీలిమ సోమవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంటి యజమాని అభ్యంతరం వ్యక్తం చేయడంతో లక్ష్మి మృతదేహాన్ని నాగరాజు తన స్వగ్రామం అప్పనపల్లికి తీసుకుని వెళ్లిపోయాడు. నీలిమ తల్లి మాణిక్యాలమ్మ ఫిర్యాదు మేరకు ముమ్మిడివరం ట్రైనీ డీఎస్పీ విష్ణు స్వరూప్ పర్యవేక్షణలో ఎస్సై ఎస్.శివప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

'నవోదయ' హాల్ టిక్కెట్ల విడుదల

రాయవరం: జవహర్ నవోదయ సమితి విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశానికి వచ్చే నెల 20న జరగనున్న పరీక్షకు హాల్ టిక్కెట్లు విడుదలయ్యాయి. ఇప్పటికే దరఖాస్తు చేసిన విద్యార్థులు https://cbseitms.rcil.gov.in/nvs/AdminCard/AdminCard లింకును క్లిక్ చేయాలి. అనంతరం రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ ఎంటర్ చేస్తే హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

మోటార్ సైకిల్ ఢీకొని వ్యక్తి మృతి

పెరవలి: మోటార్ సైకిల్ ఢీకొనడంతో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పెరవలి ఎస్సై ఎం.సూర్యభగవాన్ కథనం ప్రకారం.. మండలంలోని అన్నవరప్పాడు గ్రామానికి చెందిన గుత్తుల రామారావు (36) సోమవారం రాత్రి గుడికి వెళ్లి, తిరిగి ఇంటికి వస్తున్నాడు. అదే సమయంలో తణుకు నుంచి రావులపాలెం వైపు వెళ్తున్న మోటార్ సైకిల్ రామారావును వేగంగా ఢీకొట్టింది. దీంతో అతడు ఒక్క ఉదుటన రోడ్డుపై పడిపోయి, గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అక్కడకు వెళ్లి గమనించగా.. రామారావు చెవులు, ముక్కు నుంచి రక్తం కారుతూ గాయపడి కనిపించాడు. అతడిని హుటాహుటిన తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామారావు మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మోటార్ సైక్లిస్ట్ కూడా గాయపడ్డాడు. అతడు తణుకులో చికిత్స పొందుతున్నాడు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గ్రూప్‌-1, 2 పోస్టులకు ఉచిత శిక్షణ

- 22వ తేదీ తుది గడువు
- బీసీ సంక్షేమ అధికారి రాజేశ్వరి

కాకినాడ సిటీ: ఏపీపీఎస్సీ గ్రూప్–1, 2 ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల ప్రిలిమినరీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.రాజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం గ్రూప్–1లో 100, గ్రూప్–2 ఎగ్జిక్యూటివ్ 331, నాన్ ఎగ్జిక్యూటివ్ 566 పోస్టులకు ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించనుందని వివరించారు. వీటికి హాజరయ్యే బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రాజమహేంద్రవరంలో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. గ్రూప్–2 శిక్షణకు ఈ నెల 22వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపిక చేసిన 100 మంది అభ్యర్థులకు ఈ కేంద్రంలో ఈ నెల 27 నుంచి 50 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తారని రాజేశ్వరి తెలిపారు. అలాగే, గ్రూప్–1 అభ్యర్థులు ఈ నెల 31 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపిక చేసిన 60 మంది అభ్యర్థులకు వచ్చే నెల ఐదో తేదీ నుంచి 60 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తామని, దీంతోపాటు స్టైపెండ్, స్టడీ మెటీరియల్, బుక్ అలవెన్స్ అందిస్తారని తెలిపారు. డిగ్రీ మార్కుల్లో మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. ఈ ఉచిత శిక్షణకు కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. అభ్యర్థులు తమ పూర్తి బయోడేటాతో పాటు అన్ని విద్యార్హతల నకళ్లను, రూ.లక్ష లోపు ఆదాయం సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, రూ.10 పోస్టల్ స్టాంపులు అతికించిన సొంత చిరునామా గల కవరును దరఖాస్తుకు జత చేసి, ఈ నెల 26లోగా 'సంచాలకుడు, వెనుకబడిన తరగతుల అధ్యయన కేంద్రం, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల కాంపౌండ్, వై జంక్షన్ దగ్గర, రాజమహేంద్రవరం' అనే చిరునామాకు పంపాలని రాజేశ్వరి సూచించారు. ఇతర వివరాలకు స్టడీ సర్కిల్ డైరెక్టర్ పి.సత్యరమేష్‌ను సంప్రదించవచ్చన్నారు.

కన్నుల పండువగా రథోత్సవం



బిక్కవోలు గ్రామంలో సాగుతున్న కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి రథయాత్ర



రథంపై కొలువుదీరిన స్వామి

బిక్కవోలు: షష్ఠి ఉత్సవాల్లో భాగంగా బిక్కవోలులో శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి రథోత్సవం మంగళవారం కన్నుల పండువగా జరిగింది. భారీగా తరలివచ్చిన భక్తులు, క్యూలో వేచి ఉండి స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు బ్యాండ్ మేళాలు, కోలాటాలు, డోలు, సన్నాయి, డప్పుల వాయిద్యాల సందడితో భారీ భక్త జనసందోహం కోలాహలం నడుమ రథోత్సవాన్ని ఉత్సవ కమిటీ చైర్మన్ డాక్టర్ జంగా మురళీకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఆలయం నుంచి జి.మామిడాడ రోడ్డు మీదుగా వెళ్లి, తిరిగి గ్రామంలోని ప్రధాన రోడ్ల మీదుగా ఈ రథోత్సవం సాగింది. అంతకుముందు సోమవారం రాత్రి స్వామి వారి గ్రామోత్సవం కూడా వైభవంగా నిర్వహించారు. రాత్రి 11 గంటల నుంచి కళ్లు మిరుమిట్లు గొలిపేలా కాల్చిన బాణసంచా వేలాదిగా తరలివచ్చిన భక్తులను ఆకట్టుకుంది. సర్పం, విజిల్స్, ఈతచెట్టు, కలర్స్ ఈతచెట్టు, జపాన్ రింగ్, మల్లె పందిరి, సూర్యచక్రం, బ్యాటరీ బాక్సులు, రకరకాల తారాజువ్వలు తదితర వెరైటీలను ఈ పోటీల్లో ప్రదర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాదరెడ్డి, బిక్కవోలు శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో సీఆర్‌పీఎఫ్ జవాను మృతి

- హంసవరంలో విషాదఛాయలు
- నేడు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



కిరణ్ కుమార్ (పాత చిత్రం)



శ్రీనగర్ ఎయిర్‌పోర్టులో భర్త పార్థివ దేహం వద్ద విలపిస్తున్న విజయకుమారి

తుని రూరల్: సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ జవానుగా జమ్మూలో విధులు నిర్వహిస్తున్న తంతటి కిరణ్ కుమార్ (41) సోమవారం బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. తుని మండలం హంసవరం గ్రామం ఆయన స్వస్థలం. కిరణ్‌కుమార్ మృతి సమాచారం తెలియడంతో ఆయన భార్య విజయకుమారి, సోదరుడు రవికుమార్ హుటాహుటిన జమ్మూ వెళ్లారు. వారికి కిరణ్ కుమార్ పార్థివ దేహాన్ని సీఆర్‌పీఎఫ్ అధికారులు శ్రీనగర్ ఎయిర్‌పోర్టులో అప్పగించారు. భర్త మృతదేహాన్ని చూసి విజయకుమారి కన్నీరు మున్నీరుగా విలపించారు. రాత్రికి విశాఖపట్నానికి చేరుకుని తెల్లవారుజామున మృతదేహాన్ని గ్రామానికి తీసుకువస్తామని బంధువులు తెలిపారు. కిరణ్‌కుమార్ మృతదేహానికి బుధవారం ఉదయం అధికార లాంఛనాలతో అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కిరణ్ కుమార్‌కు భార్యతో పాటు కుమారుడు జతిన్ (12), కుమార్తె మెర్సీ (10), తల్లిదండ్రులు జాన్, భాగ్యవతి ఉన్నారు.

దేశ సేవలో ఇద్దరు కుమారులు

హంసవరం గ్రామానికి చెందిన జాన్, భాగ్యవతి దంపతులకు ముగ్గురు కుమారులు. మొదటి కుమారుడు గ్రామంలో వ్యవసాయ పనులు చేస్తుండగా రెండో కుమారుడైన కిరణ్ కుమార్ 2005లో సీఆర్‌పీఎఫ్‌లో చేరారు. మూడో కుమారుడు రవికుమార్ ఆర్మీలో చేరాడు. ఇద్దరు కొడుకులు దేశ రక్షణలో సేవలు అందిస్తుండటం తమ కుటుంబానికి ఎంతో సంతోషాన్నిచ్చిందని, కిరణ్ కుమార్ మృతి పుత్ర శోకాన్ని మిగిల్చిందని తల్లిదండ్రులు బోరున విలపించారు. కిరణ్ కుమార్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆయన కుటుంబ సభ్యులను సర్పంచ్ రాయి మేరీ అవినాష్ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వ్యాన్ డ్రైవర్ సజీవ దహనం

కాకినాడ రూరల్: వాకలపూడి ఇండస్ట్రియల్ ఏరియాలో మంగళవారం ఓ వ్యాన్ డ్రైవర్ సజీవ దహనమయ్యాడు. సర్పవరం పోలీసుల కథనం ప్రకారం.. సామర్లకోట మండలం పవర గ్రామానికి చెందిన సూరత్ బాలరాజు (64) వ్యాన్ యజమాని, డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. వాకలపూడి ఇండస్ట్రియల్ ప్రాంతంలోని సంతోషిమాత ఆయిల్ రిఫైనరీ నుంచి లోడింగ్ కోసం ఏడీబీ రోడ్డు మీదుగా ఓఎన్‌జీసీ దాటి వస్తుండగా ఉదయం 9 గంటల సమయంలో ఉన్నట్టుండి వ్యాన్‌లో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు దగ్గరకు వెళ్లి చూడగా క్యాబిన్ డోర్ ఓపెన్ అవ్వలేదు. బలవంతంగా తెరవగా అప్పటికే బాలరాజు సజీవదహనమయ్యాడు. షార్ట్ సర్క్యూట్ కారణంగా వ్యాన్‌లో మంటలు రావడంతో డోర్ ఓపెన్ అవ్వక అతడు సజీవ దహనమై ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వ్యాన్‌ను, బాలరాజు మృతదేహాన్ని డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి పరిశీలించారు. మృతుడికి భార్య, కుమారుడు రమేష్, కుమార్తె ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు ఎస్సై బాలాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి మృతి

సీతానగరం: తణుకుకు చెందిన ఆచంట అవినాష్ (23) రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం 10 గంటలకు మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ గోవిందరాజు తెలిపారు. అవినాష్ కామెర్లుతో బాధపడుతున్నాడు. జాతకం చెబుతారని తెలుసుకుని సోమవారం సీతానగరం వచ్చాడు. మంగళవారం తెల్లవారుజామున శివాలయం వద్ద పడిపోగా స్థానికులు బస్టాండ్ వద్దకు తీసుకువచ్చారు. మళ్లీ పడిపోగా అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి సమాచారం, మృతుడి తమ్ముడు చందు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైనతేయ నదిలో వృద్ధురాలి మృతి

పి.గన్నవరం: స్థానిక పాత అక్విడెక్టు వద్ద వైనతేయ గోదావరి నదీపాయలో మునిగి ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఎస్సై హరికోటి శాస్త్రి కథనం ప్రకారం.. వాడ్రేవుపల్లికి చెందిన దొమ్మేటి సత్యనారాయణమ్మ (69) తన కుమారుడు శ్రీనివాస్ వద్ద ఉంటోంది. మూడు రోజుల క్రితం తన చెల్లెలు ఇంటికి తీసుకు వెళ్లమని కుమారుడిని అడిగింది. అతడు తీసుకు వెళ్లకపోవడంతో మనస్తాపానికి గురై, సోమవారం ఉదయం వాడ్రేవుపల్లి నుంచి పి.గన్నవరం వచ్చింది. మధ్యాహ్నం వైనతేయ నదిలో స్నానం చేస్తూ గల్లంతైంది. ఆమె మృతదేహం మంగళవారం ఉదయం లభ్యమైంది.

మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపారు.

పెయింటింగ్ కార్మికుడి మృతి

కాకినాడ రూరల్: భవనానికి పెయింటింగ్ వేస్తున్న ఓ కార్మికుడు మూడో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తూ కింద పడి మృతి చెందాడు. సర్పవరం పోలీసుల కథనం ప్రకారం.. విశాఖపట్నం సీతంపేటకు చెందిన పలువురు కార్మికులు పెయింటింగ్ పనుల కోసం కాకినాడ వచ్చారు. స్థానిక ఆశ్రమ పబ్లిక్ స్కూల్ ఎదురుగా మిరియాల వీధిలో నిర్మాణంలో ఉన్న నూతన భవనానికి పెయింటింగ్ వేసేందుకు మంగళవారం పేపర్‌తో రఫ్ చేస్తుండగా ఒక కర్ర జారిపోవడంతో కార్మికుడు బొమ్మాళి రాజు (43) రాజు కింద పడిపోయాడు. అతడి తలకు బలమైన గాయమైంది. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు కార్మికులు కూడా జారి పడినప్పటికీ స్వల్పంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన రాజును నాగమల్లితోట జంక్షన్ వద్ద ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. తోటి కార్మికుడు శివరామకృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.